సాక్షి తిరుపతి

ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023



బాలిక చదువే భవితకు వెలుగు

చిత్తూరు కలెక్టరేట్ : పేద, అనాథ పిల్లలతోపాటు బడిబయట పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కేజీబీవీ పాఠశాలలను నెలకొల్పింది. – 8లో



శనేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి తైలాభిషేకం చేశారు.

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	36	22
తిరుమల	32	18
చిత్తూరు	36	22
గూడూరు	36	24
నగరి	37	24

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం(సా)	సహర్ సోమవారం(ఉ)
తిరుపతి	6.28	4.43
చిత్తూరు	6.30	4.43
పుంగనూరు	6.32	4.47

న్యూస్‌రీల్

తిరుమలలో చీఫ్ సెక్రటరీ



చీఫ్ సెక్రటరీకి స్వాగతం పలుకుతున్న టీటీడీ ఈఓ

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ సీఎస్ జవహర్‌రెడ్డి ఆదివారం దర్శించుకోనున్నారు. ఈమేరకు ఆయన శనివారం రాత్రి తిరుమల చేరుకోగా.. టీటీడీ ఈవో ధర్మారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి పద్మావతి అతిథి గృహం వద్ద ఘన స్వాగతం పలికారు.

నేడు మెగా జాబ్‌మేళా

ఏర్పేడు : మండలంలోని పాపానాయుడుపేట ప్రాథమిక పాఠశాలలో ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆదర్శ్ సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఐతేపల్లె గురునాథం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు టీసీఎల్ కర్మాగారంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగనున్నట్లు వివరించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జాబ్‌మేళా కొనసాగుతుందన్నారు. ఇతర వివరాలకు 9393949461, 9885683132 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు పకడ్బందీగా ఏర్పాట్లు చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. తాగునీరు, మజ్జిగ పంపిణీ చేయించారు. ఈ క్రమంలో రాహుకేతు సర్పదోష నివారణ పూజలు అధికంగా జరిగినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

స్విమ్స్‌లో 'బయో' కోర్సులకు ప్రవేశం

తిరుపతి తుడా : స్విమ్స్ వర్సిటీలో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ కోర్సుల్లో ప్రవేశాలను ఏపీ పీజీ సెట్ ద్వారా చేపట్టనున్నట్లు స్విమ్స్ రిజిస్ట్రార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు https:// cets. apsche. ap. gov. in వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

గరుడుని లక్ష్మీనృసింహుడు



గరుడ వాహనంపై కొలువుదీరిన శ్రీవారు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి శనివారం చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి జన్మనక్షత్రం సందర్భంగా విశేష పూజల అనంతరం బంగారు గరుడ వాహనంపై నృసింహుని ఉత్సవ విగ్రహాన్ని కొలువు దీర్చి ఊరేగించారు.

కట్టుదాటని జీవితాలు!

వారు కట్టుబాట్లకు పెద్దపీట వేస్తారు. గొడలు, కక్షలకు దూరంగా ఉంటారు. ఏదైనా సమస్యలొస్తే అందరూ కలిసి పరిష్కరించుకుంటారు. వివాదాలు తలెత్తితే పెద్దల సమక్షంలోనే చర్చించి నిర్ణయం తీసుకుంటారు. గ్రామదేవత కొల్లాపురమ్మ సన్నిధిలో పెద్దలు చెప్పే తీర్పునే వేదంగా భావిస్తారు. కోర్టులు, పోలీస్ స్టేషన్లకు వెళ్లిన దాఖలాలు ఇప్పటివరకు లేవు. ఉదయం నిద్రలేచింది మొదలు పొద్దుగూకేవరకు అడవితల్లినే నమ్ముకుని పట్టువిడుపులతో సర్దుకుపోతూ సాధారణ జీవితాన్ని సాగిస్తున్నారు. ఎప్పుడో ఊరుపుట్టినప్పటి నుంచి ఇవే కట్టుబాట్లు.. అవే ఆచారాలు పాటిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నారాయణవనం మండలం, అరణ్యకండ్రిగ పంచాయతీ, పడివేటమ్మ గిరిపుత్రుల జీవనశైలిపై 'సాక్షి' ప్రత్యేక కథనం..



పడివేటమ్మ ఎస్టీ కాలనీ

- కొల్లాపురమ్మ సాక్షిగా సర్దుకుపోయే పడివేటమ్మ యానాదులు
- కోర్టు, పోలీస్ స్టేషన్‌లు ఎరుగని గ్రామం
- వ్యక్తిగత వ్యవహారాలకు దూరం
- సమస్యలుంటే సమష్టి చర్చలతో పరిష్కారం
- ఆధునిక కాలంలో పదుగురికి ఆదర్శం

నారాయణవనం: మండలంలోని పడివేటమ్మ ఎస్టీ కాలనీ 80 ఏళ్ల క్రితం ఏర్పడింది. అప్పట్లో మామిడి తోటలు, రైతుల వద్ద పనిచేస్తూ కొందరు గిరిజనులు జీవనం సాగించేవారు. కనీసం ఇల్లు కూడా లేకపోవడంతో గోవిందప్పనాయుడుకండ్రిగ బడిలో రాత్రుళ్లు తలదాచుకునేవారు. హైవే సమీపంలోని రావి చెట్టు కింద పడివేటమ్మ గుడి పక్కనే ఉన్న కప్పల గుంటలో స్నానం చేసి అమ్మవారికి మొక్కేవారు. రైతుల సలహాతో అప్పటి పినపెద్దలు లక్ష్మయ్య, డమ్మయ్య దూరప్రాంతాల నుంచి కాపలాకు, కూలీ కోసం వచ్చిన గిరిజన కుటుంబాల కోసం అక్కడి కప్పల గుంటను పూడ్చి కాలనీ ఏర్పాటు చేయించారు. రోజూ పనికి వెళ్లే ముందు అమ్మవారిని దర్శించుకుంటే శుభప్రదంగా ఉంటుందన్న నమ్మకం వీరిలో ఇప్పటికీ ఉంది. అందుకే చెట్టు కింద ఉన్న పడివేటమ్మకు దాతల సహకారంతో ఆలయం నిర్మించారు.



కొల్లాపురమ్మ ఆలయం

పెద్దల మాటే వేదం

వ్యక్తిగత, సామూహిక సమస్యలొస్తే సాయంత్రం కాలనీలోని కొల్లాపురమ్మ ఆలయ ప్రాంగణంలో అందరూ చేరుతారు. సమస్యపై చర్చించి కుల పెద్దలు, వృద్ధుల సూచనలతో సర్దుకుపోతుంటారు. ఇప్పటి వరకు కోర్టు, పోలీస్ స్టేషన్ల గడప తొక్కలేదు. మంగళ, శుక్రవారాలు, పండుగ రోజుల్లో కొల్లాపురమ్మ, పడివేటమ్మ ఆలయాల్లో గడపడం, ఆదివారమైతే కాలనీ సమీపంలోని చర్చిలో ప్రార్థనలు చేసుకుంటూ సంఘ జీవులుగా బతుకుతున్నారు. ఒకరి వ్యక్తిగత వ్యవహారాల్లో మరొకరు పరిధికి మించి జోక్యం చేసుకోరు. సమస్య వస్తే సమష్టిగా చర్చించుకుని పరిష్కార మార్గం చూసుకుంటారు. ఇతరులకు సంబంధించిన విషయాలను పట్టించుకోరు. ఇదే ఈ కాలనీ ప్రశాంత జీవనానికి ప్రధాన కారణమని పడివేటమ్మ యానాదులు అంటున్నారు.

అందరం బంధువులమే



కాలనీలో పెద్దలంటే అందరికీ గౌరవం. సాధారణంగా సమస్యలు తలెత్తవు. అందరం ఒకరికొకరు బంధువులమే. ఒకే కుటుంబంగా భావిస్తాం. అందుకే ఏదీ సమస్యగా తీసుకోం. సమస్య అనుకుంటేనే కదా స్టేషన్‌కో.. కోర్టుకో వెళ్లాలి. కాలనీలో పెద్దలందరూ తీసుకునే నిర్ణయానికి అందరం కట్టుబడి ఉంటాం. – **రత్న, సర్పంచ్, కాలనీ వాసి.**

తీరిక ఉండదు



పనిలేకుండా ఖాళీగా ఉంటేనే సమస్యలు వస్తాయి. ఒకరిపై ఒకరు మాట్లాడుకునే అవకాశం ఉంటుంది. ఉదయమైతే అందరం ఏదో ఒక కూలి పనికి పోయి సాయంత్రానికి చేరుకుంటాం. పనిలో అలసిపోతాం.. ఇంటికొస్తే ఏదో తినేసి నిద్ర పోతాం. పండగలు, కొలువులు అందరం కలిసి జరుపుకుంటాం . వ్యత్యాసం ఉండదు.

– **వెంకటమ్మ, కాలనీ వాసి**

బయటోళ్లకు అవకాశం లేదు



సమస్య వస్తే బయటి వారికి అవకాశం ఇవ్వం. ఎంతైనా అందరం కలిసి మాట్లాడుకుంటాం . పరిష్కరించుకుంటాం. బయటోళ్లు వస్తే ఒక పక్షానికి వత్తాసు పలికితే ఎలా సర్దుబాటు అవుతుంది..? అందుకే చిన్నదైనా.. పెద్దదైనా అందరం కొల్లాపురమ్మ ముందు కుర్చుని పరిష్కరించుకుంటాం. – **గంగమ్మ, కాలనీ వాసి**

పెద్దల అడుగు జాడలే..



నేటి యువకులూ పెద్దల అడుగు జాడల్లో నడుస్తున్నారు. గొడవలు, రచ్చలకు దూరంగా ఉంటున్నారు. చదువుకున్నోళ్లు 40 మంది వరకు ఉన్నారు. వీరందరికీ కొలువులు వస్తే.. జీవితాలు బాగుపడుతాయి. అప్పట్లో ఒకరికి సమస్య వస్తే అందరిదిగా భావించేవాళ్లం. అదే బాటలో మా పిల్లలు నడుస్తున్నారు. – **సుబ్బమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యులు, కాలనీ వాసి**

ప్రజావసరాలకే తొలి ప్రాధాన్యం

- తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ హరిత



బాధ్యతలు స్వీకరిస్తున్న హరిత

తిరుపతి తుడా : ప్రజావసరాలకే తొలి ప్రాధాన్యమిస్తామని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత స్పష్టం చేశారు. శనివారం ఆమె కమిషనర్‌గా, తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఎండీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హరిత మాట్లాడుతూ ఆధ్యాత్మిక నగరాన్ని అందరి సహకారంతో మరింత అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. తిరుపతిపై తనకు పూర్తి అవగాహన ఉందని, పక్కా ప్రణాళికతో ముందుకు వెళతామన్నారు. ప్రస్తుతం సాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. స్వచ్ఛ సర్వేక్షణ్, స్మార్ట్‌సిటీ విభాగాల్లో మరింత ప్రగతి సాధించి తిరుపతి పరపతిని ఇనుమడింపజేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని తెలిపారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మాస్టర్‌ప్లాన్ రోడ్లను సకాలంలో పూర్తి చేయిస్తామని స్పష్టం చేశారు. అనంతరం కమిషనర్‌కు డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్, ముద్రనారాయణ, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, ఎస్ఈ మోహన్, ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, రెవెన్యూ ఆఫీసర్ కేఎల్ వర్మ, డీసీపీ దేవికుమారి, ఏసీపీలు బాలసుబ్రమణ్యం, షణ్ముగం, స్మార్ట్‌సిటీ జీఎం చంద్రమౌళి, మేనేజర్ చిట్టిబాబు, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్కే బాబు శుభాకాంక్షలు తెలిపారు.

వారపు సంతలో ఉచిత భోజనాలు



భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

పాకాల : మండలంలోని దామలచెరువులో వారపు సంతలో శనివారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన సొంత నిధులతో ఉచితంగా భోజనాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన కూరగాయలను అమ్ముకోవడానికి సంతలకు వస్తారని తెలిపారు. ఆ సమయంలో అన్నం తినడానికి సమయం కూడా ఉండదన్నారు. కూరగాయలు అమ్మిన డబ్బు అవసరాలకు కూడా సరిపోదని భావించి నీరు తాగి ఇంటికి వెళ్లిన రైతులను చూశానని, వారికి అన్నం పెట్టి ఆకలి తీర్చాలనే అన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అన్నం పండించే రైతుల ఆకలి తీర్చడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజారెడ్డి, కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, మునీశ్వర్ రెడ్డి, రఘుపతి, రహీం, ఖాజామస్తాన్ పాల్గొన్నారు.

ప్రజల మనసున... సంక్షేమ స్పందన

విజయపురం (నగరి): ప్రజల మనసుల్లో సంక్షేమ స్పందన వినిపిస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు , క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. విజయపురం మండలం, కోసలనగరం ఎస్టీకాలనీలో శనివారం 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని మంత్రి నిర్వహించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు సచివాలయ కార్యదర్శులు, గృహసారథులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై వారి స్పందనను తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయమని అందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మంత్రి చెప్పారు. జన్మభూమి కమిటీ కనికరిస్తేనే పథకం అందే అగత్యం నేడు తప్పిందని స్పష్టం చేశారు. వీధి బడి విధిరాత ఇంతేలే అన్న అభిప్రాయం సమూలంగా మారి పాఠశాలలు కార్పొరేట్ స్థాయికి చేరాయని, సర్కారు స్కూలు విద్యార్థి బూట్లు, బ్యాగు పట్టుకొని ఇంగ్లీషు చదువులు చదువుతున్నారని చెప్పారు. రేషన్ కార్డు కావాలంటే ఏళ్లకు ఏళ్లు ఎదురుచూడాల్సిన దుస్థితి ఇప్పుడు లేదన్నారు. సిఫారసు లేకుండా సంక్షేమం అందుతోందని, లైనులో నిలబడకుండా విత్తనాలు, ఎరువులు రైతు చెంతకు వస్తున్నాయని చెప్పారు. యువతకు సొంత జిల్లాలో సచివాలయ ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఇవన్నీ వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేయడం వల్ల వచ్చిన మార్పులన్నారు. ఎంపీపీ జమున, వైస్ ఎంపీపీలు బాలాజీ, దశరథరాజు, ఎంపీడీవో సతీష్ తహసీల్దారు వెంకటరాయలు, ఆర్బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు రాజేంద్రన్, డాక్టర్ సోమశేఖర్, సింగిల్‌విండో అధ్యక్షుడు హరినాయుడు, నాయకులు శేఖర్ రాజు, శివరాజు, కుమార్ పాల్గొన్నారు.



మహిళలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి రోజా

● జయహో భారత్

అత్యంత వేగం.. అత్యాధునిక హంగులు..విమానంలో ప్రయాణిస్తున్న అనుభవం అందిస్తూ దూసుకెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ శనివారం రాత్రి తిరుపతికి చేరింది. ఈ క్రమంలో సాయంత్రం జిల్లాలోకి ప్రవేశించిన తర్వాత ముందుగా గూడూరులో కొద్దిసేపు ఆగింది. అనంతరం శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ సందర్శకులకు కనువిందు చేసింది. – **తిరుపతి అర్బన్**



వందేభారత్ ఎక్స్‌ప్రెస్



తిరుపతిలో స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి, కలెక్టర్ తదితరులు



ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో విద్యార్థుల సెల్ఫీ

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్ట్

నాయుడుపేటటౌన్: పట్టణంలోని తుమ్మూరు వద్ద సంజయ్‌గాంధీ కాలనీలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్‌ఈబీ సీఐ ఆర్‌యూవీ ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడి చేశారు. ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి మూడు బైక్‌లు, 5 సెల్‌ఫోన్‌లతో పాటు రూ.7,120 నగదును స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడికి గాయాలు


గాయపడిన విజయ్

నాయుడుపేటటౌన్ : మండలంలోని పుదూరు సమీపంలో శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ యువకుడు గాయపడ్డాడు. వివరాలు.. తిరుచానూరుకు చెందిన విజయ్ బైక్‌పై తూపిలిపాళెం బీచ్‌కు వెళ్లాడు. తిరుగుప్రయాణంలో ఉండగా బైక్ అదుపు తప్పడంతో కిందపడ్డాడు. క్షతగాత్రుడిని 108లో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'జూ'కు కొత్త జంతువులు

తిరుపతి మంగళం : తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల(ఎస్వీ జూ)కు శనివారం కొత్త జంతువులు వచ్చాయి. జంతు మార్పిడి పథకం కింద తిరుపతి జూ నుంచి కొన్ని జంతువులను కాన్పూర్ జూకు పంపించి, అక్కడి నుంచి జూ వైద్యుల పర్యవేక్షణలో కొత్త జంతువులను తీసుకుని వచ్చారు. అయితే ఏఏ జంతువులను తీసుకుని వచ్చారన్న విషయాన్ని జూ అధికారులు వెల్లడించ లేదు.

బాలిక చదువే భవితకు వెలుగు

పేద, అనాథ పిల్లలతోపాటు బడిబయట పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయ (కేజీబీవీ) పాఠశాలలను నెలకొల్పింది. పేద, అనాథలతోపాటు బడి బయట ఉన్న బాలికలకు కస్తూర్బా విద్యాలయాలు వరంగా మారాయి. ఉన్నత విద్యాప్రమాణాలు, ఆహ్లాదకర వాతావరణం, ఆంగ్ల మాధ్యమంలో బోధన.. ఇలా ఎన్నో సౌకర్యాలతో కార్పొరేట్ విద్యా సంస్థలను తలపించే ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు ఏటా పోటీ పెరుగుతోంది. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది.

- కేజీబీవీ పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభం
- అనాథ, పేద బాలికలకు కేజీబీవీలు వరం
- ఉచిత విద్యతోపాటు వసతి సౌకర్యం
- 20వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం



శాంతిపురం కేజీబీవీలో విద్యార్థినులు

చిత్తూరు కలెక్టరేట్:జిల్లా వ్యాప్తంగా 8 కేజీబీవీ పాఠశాలలున్నాయి.ఈ పాఠశాలలు పేద, అనాథలతో పాటు బడి బయట ఉన్న బాలికలకు వరంగా మారాయి. ఉన్నత విద్యాప్రమాణాలు, ఆహ్లాదకర వాతావరణం.. ఇంగ్లిషు మీడియంలో బోధన.. ఇలా ఎన్నో సౌకర్యాలతో కార్పొరేట్ విద్యా సంస్థలను తలపించే ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు ఏటా పోటీ పెరుగుతోంది. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచిత విద్య, వసతి కల్పిస్తుండడంతో తమ పిల్లలను చేర్చేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి 6,7,8,9 తరగతులతోపాటు ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఇతర వివరాలకు 8978905307, 6301084843, 6281711838, 9573598070 నెంబర్లలో సంప్రదించాలని అధికారులు వెల్లడించారు.

పేద బాలికలకు వరం కేజీబీవీలు

చదవాలనే ఆసక్తి ఉన్నా పరిస్థితులు అనుకూలించక కొందరు.. ఆర్థిక స్థోమత లేక మరికొందరు.. తల్లిదండ్రులను కోల్పోయిన అనాథలు.. ఇలా ఎంతో మంది పలు గ్రామాల్లో గతంలో బాలికలు చదువుకు దూరమయ్యేవారు. అలాంటి వారు చదువు కొనసాగించాలనే లక్ష్యంతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏర్పాటు చేసిన కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు ప్రవేశపెట్టారు. నాడు 6 నుంచి 10వ తరగతి వరకు మాత్రమే చదువుకునే అవకాశం ఉండగా.. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటర్ వరకు పెంచారు. అలాగే నాడు – నేడు మనబడి కార్యక్రమంలో భాగంగా సౌకర్యాలు మెరుగు పరచడంతో వాటిలో ప్రవేశాలకు మరింత పోటీ ఏర్పడింది.

ప్రాధాన్యతా క్రమంలో భర్తీ

సీట్ల భర్తీలో నిబంధనల మేరకు అనాథ, సింగిల్ పేరెంట్, బడి మధ్యలో మానేసిన, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కేటగిరీల వారీగా ప్రాధాన్యతా క్రమంలో సీట్లు కేటాయించనున్నారు. ప్రస్తుతం ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు సీట్లు భర్తీ చేస్తున్నారు. అందులో భాగంగా 6వ తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో మొత్తం సీట్లు భర్తీ చేస్తారు. 7, 8, 9 తరగతులకు ఖాళీల మేరకు అడ్మిషన్లు ఉంటాయి. ఇందుకోసం విద్యాశాఖ ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించింది. www.apkgbv.apcfss.in వెబ్‌సైట్‌లో విద్యార్థి పేరు, కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్, కుల, ఆదాయ, రేషన్‌కార్డు నకలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఎంపికైన బాలికలకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుంది. సంబంధిత పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చు.

సకల వసతులు

కేజీబీవీల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వాచ్‌మెన్‌లు, వంట మనుషులు ఇలా ప్రతి ఒక్కరూ మహిళలు మాత్రమే ఉంటారు. విద్యతోపాటు ఉచిత భోజనం, వసతి, పౌష్టికాహారం, యూనిఫాం, షూ, దుప్పట్లు అందజేస్తారు. కరాటే శిక్షణతో పాటు ఇంగ్లిష్ గ్రూప్ డిస్కషన్స్, డ్యాన్స్, చిత్రలేఖనం, యోగా, స్వయం ఉపాధి కోర్సులు, కంప్యూటర్ విద్య, బాలికా సాధికారత క్లబ్‌ల ఏర్పాటు తదితర వాటిపై శిక్షణ, అవగాహన కల్పిస్తారు. తల్లిదండ్రులు లేని అనాథ బాలికలకు విద్యాలయంలోనే అన్ని వసతులు, సౌకర్యాలూ కల్పిస్తున్నారు. ప్రతి మూడు నెలలకోసారి 15 రకాల వస్తువులతో కూడిన హెల్త్ – హైజిన్ కిట్‌లు (ఆరోగ్య పరిశుభ్రత కిట్లు) అందజేస్తారు.

అవకాశాన్ని వినియోగించుకోవాలి



2023–24 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. ఈ అడ్మిషన్ల ప్రక్రియపై మండల స్థాయిలో, గ్రామస్థాయిలో సీఆర్‌పీలు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్‌లు, కేజీబీవీ ఎస్‌వోలు, ఇతర విద్యాశాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలి. అనాథలు, బడిబయట పిల్లలు, బడి మానేసిన బాలికలను గుర్తించి వారిని అన్ని విధాలుగా తీర్చిదిద్దేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. ఈ నెల 20వ తేదీ లోపు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా చర్యలు చేపడుతున్నాం.
– పి.వెంకటరమణారెడ్డి, ఏపీసీ, సమగ్రశిక్ష శాఖ, చిత్తూరు

నకిలీ టికెట్ల విక్రయంపై ఫిర్యాదు

తిరుమల : శ్రీవారి సుప్రభాతం సేవకు సంబంధించి నకిలీ టికెట్లను విక్రయించిన దళారీపై బాధితులు ఫిర్యాదు చేశారు. తిరుమల టూటౌన్ సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం, నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన భక్తుడు కోట్ల సుమాన్ శ్రీవారి సుప్రభాత సేవా టికెట్ల కోసం తిరుపతికి చెందిన దళారీ వేణును సంప్రదించారు. సదరు దళారి ఏడు సుప్రభాత సేవా టికెట్లను రూ.30వేలకు విక్రయించాడు. ఈ టికెట్లతో సుమాన్ తదితరులు శ్రీవారి సుప్రభాతసేవకు వెళ్లడంతో వాటిని పరిశీలించిన టీటీడీ విజిలెన్స్ అధికారులు నకిలీవిగా గుర్తించారు. దీంతో బాధితులు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనసైనికుల సైకో ప్రవర్తన

సాక్షి, తిరుపతి: తిరుపతి నగరంలో జనసైనికులు సైకోలాగా వ్యవహరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రారంభించగా..దాన్ని జీర్ణించుకోలేని జనసేన పార్టీ నాయకులు శనివారం తిరుపతి నగరంలోని 16వ డివిజన్‌లో ×మాకు నమ్మకం లేదు జగన్.. మాకు నమ్మకం పవన్✓ అనే స్టిక్కర్లను అంటించారు. ఈ స్టిక్కర్లు కూడా కేవలం పవన్ కళ్యాణ్ అభిమానుల నివాసాలకు మాత్రమే అంటించారు. అయితే ఎల్లో మీడియా ఈ విషయాన్ని పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుని రాక్షసానందం పొందుతోంది.


తిరుపతి బులియన్

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.62,310
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,566
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.76,200
రిటైల్ వెండి గ్రాము రూ.78.20

ముక్కంటి సేవలో హైకోర్టు న్యాయమూర్తి


ఆలయ ధ్వజస్తంభం వద్ద న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఏఈఓ సతీష్‌మాలిక్ ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. ముందుగా ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్న అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇవ్వగా అధికారులు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి, జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ పాల్గొన్నారు.